పొమ్మనలేక పొగ..!

- సచివాలయ ఉద్యోగులపై పనిభారం
- ఊపిరి సలపని సర్వేలతో ఉక్కిరిబిక్కిరి
- కూటమి నేతల ఒత్తిళ్లతో సతమతం
- సచివాలయాలను నిర్వీర్యం చేసేలా కూటమి ప్రభుత్వ ఎత్తుగడలు



కార్యదర్శులు సర్వేకు వెళ్లడంతో ఖాళీగా దర్శనమిస్తున్న సచివాలయం

సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటికి చేర్చేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. సచివాలయ కార్యదర్శులపై పని ఒత్తిడి పెంచడంతో పాటు సర్వేల పేరిట ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దీంతో వారంతా కలత చెందుతున్నారు.

విశాఖ విద్య: ప్రజల చెంతకు పాలనను చేరువ చేస్తూ గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన సచివాలయ వ్యవస్థ అనతికాలంలోనే అందరి మన్ననలు పొందింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు చెప్పులరిగేలా తిరగాల్సిన అవసరం లేకుండా, తమ ఇంటి సమీపంలో ఉన్న సచివాలయంలోనే పనులు పూర్తయ్యేవి. దళారుల ప్రమేయం కూడా లేకపోవటంతో సచివాలయాలు ప్రజానీకం పాలిట దేవాలయాలుగా మారాయి. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు సైతం అంకితభావంతో విధులు నిర్వర్తించడంతో ప్రశంసలు అందుకున్నారు.

ఐదేళ్లలోనే ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్న సచివాలయాలను కనుమరుగు చేయాలని కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, దీనిలో భాగంగానే సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని ఇబ్బంది పెడుతోందనే ప్రచారం సాగుతోంది. సాంకేతిక సమస్యలు సృష్టించి, పనిచేయటం లేదని అపవాదు వేస్తోంది. సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని రేషనలైజేషన్ పేరుతో ఇతర శాఖలకు పంపించేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. ఇంకా మిగిలి ఉన్న వారిపై తీవ్ర పనిభారం మోపుతూ, వారిని పొమ్మనలేక పొగపెడుతున్నట్లుగా ఉంది పరిస్థితి.

కూటమి నేతలు చెప్పిందే వినాలట..

సచివాలయ ఉద్యోగులను కూటమి నేతలు అవమానకరంగా చూస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము చెప్పింది వినకపోతే, ఉద్యోగం ఊడిపోతుందనే బెదిరింపులకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల ప్రక్రియ, వాటి పరిశీలన జరుగుతుండగా, అర్హతలు లేనివారికి కూడా కార్డులు ఇప్పించేలా కూటమి నేతలు సిఫార్సు చేస్తుండటంతో, ఇది తమకు ఎక్కడ చుట్టుకుంటుందోనని సచివాలయ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.



90వ వార్డులో సర్వర్ పనిచేయక వేచి ఉన్న ఉద్యోగి

ఉన్నత విద్యావంతులే అయినా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సచివాలయాల్లో ఉద్యోగాల భర్తీ అంతా అర్హతల మేరకు పారదర్శకంగా జరిగింది. ఇక్కడ పనిచేస్తున్న వారంతా పట్టభద్రులే. పోస్టు గ్రాడ్యుయేషన్, ఇతర ఉన్నత కోర్సులు చేసిన వారు సైతం ఉన్నారు. విద్యావంతులైన వీరిని, కూటమి నేతలు అవమానకరంగా చూస్తుండటంపై సచివాలయ ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు సైతం, తమను చులకనగా చూస్తుండటంతో, తమ ఇబ్బందులను ఇంకెవరికి చెప్పుకోవాలని సచివాలయ ఉద్యోగులు మథనపడుతున్నారు. ప్రజాదరణ పొందిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం ఈ రీతిన నిర్వీర్యం చేయటం ఎంతమాత్రం తగదని పలువురు అంటున్నారు.

సర్వేలతో ఉక్కిరిబిక్కిరి



కాలనీల్లో సర్వే చేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం మండలంలో 60 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 450 మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరికి ప్రతి నెలా పింఛన్ల పంపిణీ బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా వరస సర్వేలతో ఒత్తిడి పెంచారు. పీ4 సర్వే, ఈకేవైసీ, ఇంటింటి సర్వే, మన మిత్ర ప్రచారం, యోగ సర్వే, స్ట్రీట్ వెండార్స్ సర్వే, అసెస్‌మెంట్ నంబర్లకు ఆధార్ అనుసంధానం.. ఇలా ఒకేసారి పదుల సంఖ్యలో సర్వేలను ఏకకాలంలో చేయాల్సి రావటంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ప్రభుత్వ పరంగా అమలు చేసే కార్యక్రమాలన్నింటిలో వీరినే భాగస్వాములను చేస్తూ, ఏ రోజుకారోజు టార్గెట్లు ఇస్తూ, సాయంత్రానికి నూరుశాతం పూర్తి చేయకపోతే చర్యలు తప్పవంటూ ఉన్నతాధికారులు హెచ్చరికలు చేస్తుండటంతో సచివాలయ ఉద్యోగులు తీవ్రంగా కలత చెందుతున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లతో విస్తృత స్థాయి సమావేశం ఆదివారం సాయంత్రం 5 గంటలకు 58వ వార్డు పిలకవానిపాలెం వద్ద గల వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో జరగనుంది. ఈ సమావేశానికి పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని 40, 58, 59, 60, 61, 62, 63 వార్డుల కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు తదితరులతో ఆయన సమావేశమవుతారు. ఈ నెల 4వ తేదీకి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో, కూటమి ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వంటి సమస్యలపై పార్టీ చేపట్టబోయే పోరాటాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పార్టీ ప్రతినిధులు కోరారు.

నేడు కరాటే పోటీలు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు, మాజీ సైనిక కాలనీ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రీడా మైదానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు కరాటే పోటీలు, బహుమతుల ప్రదానోత్సవం జరగనుందని కరాటే కోచ్ జీ.శ్రీనివాస్‌రావు (భరత్) తెలిపారు. ప్రభుత్వ విప్ పి.గణబాబు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ హీరో సుమన్, కరాటే కోచ్‌లు సతీష్‌కుమార్, బి.శ్రీనివాసరావు, బి.రామ్‌కుమార్ తదితరులు పాల్గొంటారన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులు జ్ఞానం పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న యువజన నాయకుడు బాలకిషోర్

మల్కాపురం: జ్ఞానం పుస్తకాలు చదవడం ద్వారా పెరుగుతుందని యువజన నాయకులు కె. బాలకిషోర్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా మల్కాపురం శాఖ గ్రంథాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాధారణ జ్ఞానం ఆత్మవిశ్వాసాన్ని పెంచి, పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి సహాయపడుతుందని బాలకిషోర్ పేర్కొన్నారు. ప్రపంచ దేశాలలో గతంలో, ప్రస్తుతం జరుగుతున్న సంఘటనల గురించి సులభంగా తెలుసుకోవచ్చన్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సాధారణ జ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి



పేదలకు సరకులు అందిస్తున్న రమణ

గోపాలపట్నం: సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేహాద్రి గెడ్డ కాలనీలోని జీవీఎంసీ 92వ వార్డులో సూపర్‌స్టార్ కృష్ణ మహేష్ బాబు అభిమాన సంఘం ఈ వేడుకలను నిర్వహించింది. ఈ సందర్భంగా అభిమాన సంఘం అధ్యక్షుడు బల్ల రమణ మాట్లాడుతూ, తెలుగు సినిమా చరిత్రలో నూతన ఆవిష్కరణలు చేసిన గొప్ప నటుడు కృష్ణ అని కొనియాడారు. ఈ కార్యక్రమం సందర్భంగా స్థానిక పేదలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అభిమానులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

జీవితాలను చిత్తు చేసే పొగాకు

మహారాణిపేట: జాతీయ పొగాకు నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంహెచ్‌వో) ఉద్యోగులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు సాగింది. ఈ ర్యాలీని ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ పొగాకు తాగే వారి జీవితాన్నే కాకుండా కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందని, అందుకే భారత ప్రభుత్వం పొగాకును కొన్ని బహిరంగ ప్రదేశాలలో వినియోగించడం నిషేధించిందన్నారు. ప్రతి సంవత్సరం పొగాకు, ధూమపానం వల్ల వచ్చే అనారోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించేందుకు మే 31న పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. పొగాకు వినియోగాన్ని తగ్గించుకుంటూ పోవడమే ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొందన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ హారిక మాట్లాడుతూ పొగాకు నియంత్రణకు అన్ని డిపార్టుమెంట్లు కలిసి పని చేయాలని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించాలని, గ్రామ పంచాయతీ సభ్యులు, ఎన్‌జీవో సంస్థలు, రైతులు, యువత, విద్యార్థులు పొగాకు రహిత దేశ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు ధర్మేంద్ర, మోహన్, వైద్యులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టంపై యువతకు వివరిస్తున్న సింధు

మల్కాపురం: నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, జ్ఞానం పొందుతూ, మంచి పుస్తకాలు చదువుతూ ఆరోగ్యవంతమైన జీవితానికి పునాదులు వేసుకోవాలని బ్రహ్మకుమారి సంస్థ (శ్రీహరిపురం) నిర్వాహకురాలు సింధు అన్నారు. మాదకద్రవ్యాల సేవించడం వల్ల కలిగే పరిణామాలను వివరిస్తూ 60వ వార్డు గుల్లపాలెం, వాకింగ్ పార్కు వద్ద శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎంతో విలువైన జీవితాన్ని చెడు అలవాట్ల వల్ల నాశనం చేసుకోకూడదని సింధూ సూచించారు. ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్, ధూమపానం, మద్యపానం వంటివి ఆరోగ్యాన్ని పాడుచేస్తాయని, తద్వారా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని ఆమె హెచ్చరించారు. నిత్యం నచ్చిన దేవుడిని ప్రార్థిస్తూ, మంచి స్నేహితులతో పరిచయాలు పెంచుకొని, మంచి పుస్తకాలు చదువుతూ సమాజం గుర్తించే స్థాయికి ఎదగాలని ఆమె యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు ధర్మబాయి తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఫ్యాన్ల కొరతతో అవస్థలు





స్టేషన్‌లో ఫ్యాన్లు లేక అవస్థలు

అగనంపూడి: మండే ఎండలు, ఊపిరి సలపని ఉక్కపోత, సరిగా పనిచేయని ఫ్యాన్లతో రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు ఉక్కపోతతో ఊపిరాడక, చెమటలు కక్కుతూ అవస్థలు పడుతున్నారు. గతంలో ప్లాట్‌ఫామ్ ఒకటిపై ముఖద్వారం వద్ద మాత్రమే షెల్టర్లు ఉండేవి. ఇటీవల జరిగిన అభివృద్ధి పనుల్లో భాగంగా రెండు వైపులా షెడ్లు ఏర్పాటు చేసినా, ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన స్టీల్, టైల్స్ బెంచీలు ఉన్న చోట ఫ్యాన్లు అమర్చలేదు. ఉన్న ఫ్యాన్లు ప్రయాణికులకు గాలి తగలని విధంగాఏర్పాటు చేయడంతో అవి ప్రయోజనం లేకుండా పోయాయి. ప్రయాణికులు నడిచివెళ్లే మార్గంలో ఫ్యాన్లు ఏర్పాటు చేయడం, కూర్చోడానికి ఏర్పాటు చేసిన బెంచీల వద్ద అమర్చకపోవడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ప్రయాణికులకు అనువుగా ఉండేలా ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కానిస్టేబుల్ పరీక్షా కేంద్రం తనిఖీ



పరీక్షా కేంద్రంలో వసతులను పరిశీలిస్తున్న ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ లక్ష్మణమూర్తి

అల్లిపురం: డాబాగార్డెన్స్ పెన్ స్కూల్‌లో కానిస్టేబుల్స్ మెయిన్స్ పరీక్షా కేంద్రాన్ని శనివారం ఉదయం ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి, టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు, ఫైర్ అండ్ సేఫ్టీ వసతులపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, పర్సులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదని ఏసీపీ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రం, చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో పరీక్ష ముగిసేంత వరకు జిరాక్స్, ప్రింటింగ్ సెంటర్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, పరీక్షలు కొనసాగుతున్నంత సేపు మొబైల్ పెట్రోలింగ్ బృందం నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తుందని ఏసీపీ లక్ష్మణమూర్తి తెలిపారు. పరీక్ష ముగిశాక ప్రశ్న పత్రాల తరలింపు, సమాధాన పత్రాలు తరలించేందుకు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా జరగడానికి పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. 350 మంది విద్యార్థులు పెన్ స్కూల్ కేంద్రంగా పరీక్ష రాయబోతున్నట్టు ఏసీపీ తెలిపారు. ఎస్ఐ ఎ. మన్మథరావు వారి వెంట ఉన్నారు.

స్నేహ, సాంస్కృతిక, ఉద్యమాల సారథి సుకుమారన్



సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఆచార్య కేఎస్ చలం

దాబాగార్డెన్స్: కమ్యూనిస్ట్ యోధుడిగా, శాంతి, సాంస్కృతిక ఉద్యమాల సారధిగా, స్నేహశీలిగా పేరున్న టీఎస్ సుకుమారన్ అందరి మన్ననలు పొందారని, నిజమైన కమ్యూనిస్టుగా జీవనం సాగించారని యూపీఎస్సీ పూర్వ సభ్యుడు, ఆలిండియా ప్రొగ్రెసివ్ ఫోరం జాతీయ అధ్యక్షుడు ఆచార్య కేఎస్ చలం పేర్కొన్నారు. విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, సీపీఐ నాయకుడు, ఇస్కఫ్ నాయకుడు సుకుమారన్ ఇటీవల మరణించిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేఎస్ చలం మాట్లాడుతూ విశాఖలో ఏ సాంస్కృతిక కార్యక్రమం జరిగినా గుర్తుకు వచ్చే పేరు సుకుమారన్ అని, ప్రతి కార్యక్రమంలోనూ ఆయన పాత్ర ఉండేదన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సమాజానికి తన వంతు ఏదో ఒకటి చేయాలన్న ఆత్రుతతో ఉండేవారన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న కళలు, సంస్కృతిని విశాఖకు పరిచయం చేసిన ఘనత సుకుమారన్‌దేనని చెప్పారు. కార్యక్రమంలో ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాగితాల రాజశేఖర్, జాతీయ ప్రధాన కార్యదర్శి పడిహారి, ఇస్కఫ్ తెలంగాణ ప్రెసిడెంట్ కడారు ప్రభాకరరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి పి. బియజ్‌కుమార్, ఆచార్య వి. బాలమోహన్‌దాస్, పీవీఎస్ మూర్తి, సనపల నరసింహులు, క్షేత్రపాల్‌రెడ్డి, సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్, సీపీఐ నాయకులు మరుపిళ్ల పైడిరాజు, ఎంఏ మాధవరావు, మధుమతి, కేఎస్ సురేష్‌కుమార్, నర్సింహమూర్తి, ఆర్. పిచ్చయ్య, ఎస్‌వీ రమేష్, లక్ష్మీ గణపతి, సూర్యనారాయణ, అరుణ్‌కుమార్, రాజు, ఆచార్య మంజులత తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలు వివరించండి



అనుబంధ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

గోపాలపట్నం: ఏడాది పాలనలో కూటమి చేసిన మోసాలను వివరిస్తూ ప్రజల్లోకి వెళ్లాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం సీతమ్మధార క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గం అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలో సామాన్యుడు కుదేలయ్యాడని, సాధారణ కూలీల నుంచి రైతులు, ఉద్యోగుల వరకు అన్ని వర్గాల వారు మోసానికి గురై ఇబ్బందులు పడుతున్నారని దుయ్యబట్టారు. పాలనా వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని, రాష్ట్రాన్ని అధ్వాన స్థితికి చేర్చారని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న అరాచకత్వాలను ప్రజలకు వివరించాలని, జూన్ 4న నిర్వహించే 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా వచ్చే విధంగా అందరూ కృషి చేయాలని విజయప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలు అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన జీవీఎంసీ ఉద్యోగులకు వీడ్కోలు



పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణ

అల్లిపురం: ఉద్యోగ విరమణ చేసిన ప్రతి ఉద్యోగి శేష జీవితం ఆనందంగా గడపాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి అన్నారు. శనివారం జీవీఎంసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి ఉద్యోగ చేసిన 12 మంది అధికారులు, ఉద్యోగులను ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎస్.వి. నరేష్ కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లు పద్మజ, అప్పలనాయుడుతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలం మనతో విధులు నిర్వర్తించి నేడు విధులను విడిచి వెళుతున్నందుకు తోటి ఉద్యోగులందరికీ బాధ కలుగుతుందన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం జోక్యం చేసుకోవాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 3,000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జోక్యం చేసుకోవాలని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు మాజీ డైరెక్టర్ బొడ్డు పైడిరాజు విజ్ఞప్తి చేశారు. శనివారం ఉక్కునగరంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 25–30 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులను యాజమాన్యం అక్రమంగా తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగింపులపై ప్రశ్నించిన కార్మిక నాయకులకు నోటీసులు జారీ చేయడమే కాకుండా, పోలీసు కేసులు కూడా నమోదు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ పరిణామాలు కూటమి ప్రభుత్వానికి నష్టదాయకమని పేర్కొన్నారు.

బకాయిలు తక్షణమే చెల్లించాలి

విశాఖ సిటీ : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తున్నారని సాంఘిక సంక్షేమ రిటైర్డ్ గురుకుల ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు కె.కామయ్య ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పేద, వెనుకబడిన విద్యార్థులకు విద్యనందించిన తమకు కనీస న్యాయమైన బెనిఫిట్స్ అందక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పదవీ విరమణ చేసిన వారికి రావాల్సిన శాలరీ ఎరియర్స్, డీఏ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు ఉన్నాయని వెల్లడించారు. అధికారులకు ఎన్నిసార్లు వినతులు సమర్పించినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అన్ని పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సాగర తీర పరిశుభ్రతలో స్వచ్ఛంద భాగస్వామ్యం



విక్టరీ ఎట్ సీ తీరం వద్ద సేకరించిన వ్యర్థాలతో స్వచ్ఛంద సంస్థల సభ్యులు

ఏయూక్యాంపస్: సాగర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి నిరంతరం నగరవాసులు, స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి. దీనిలో భాగంగా శనివారం ఉదయం ప్లాస్టిక్ ఫర్ చేంజ్ సంస్థ, గార్నియర్ ఇండియా సహకారంతో బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించింది. ఆర్కే బీచ్, వైఎంసీఏ-విక్టరీ ఎట్ సీ వద్ద సాగర తీరంలో ఉన్న వ్యర్థాలను స్వచ్ఛందంగా ఏరివేశారు. వీటిలో పెట్ బాటిల్స్ 60 కేజీలు, ప్లాస్టిక్ 300 కేజీలు, గాజు సీసాలు 230 కేజీలు, కొబ్బరి బొండాలు 120 కేజీలు, చెప్పులు 60 కేజీలు, కర్రలు 400 కేజీలు, తాళ్లు, ఇతర వస్తువులు 30 కేజీలు ఉన్నాయి. ప్రజల సహకారం, భాగస్వామ్యంతో ఇటువంటి సమాజహిత కార్యక్రమాలు చేపట్టడం వీలవుతుందని వైజాగ్ ఎన్‌జీవో ఫోరం కార్యదర్శి ప్రజ్ఞాన్ కుమార్ తెలిపారు. సత్యవేణి సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో అర్జున్ తదితరులు, నగరానికి చెందిన 313 మంది స్వచ్ఛందంగా పాల్గొని సాగర తీరాన్ని శుభ్రం చేశారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అపర్ణ, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న నేతలు

గోపాలపట్నం: వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ గణబాబు, ఉత్తర శాసన సభ్యుడు విష్ణుకుమార్ రాజు, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, శాసన మండలి విప్ చిరంజీవి హాజరయ్యారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో ముందుందని, ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తోందని అన్నారు. మార్కెట్ కమిటీ ద్వారా సేవలను మరింత విస్తృతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యలమంచిలి అపర్ణ, వైస్ చైర్మన్ వెంకుమహంతి చంద్రశేఖర్, డైరెక్టర్లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ పాపారావు, ఏడీఎం యాసిన్ తో పాటు పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.